కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.15, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 23, బెండకాయ 48, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 38, పందిరి బీర 55, క్యాబేజీ 19, క్యారెట్ 25, దొండ 45, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 41, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 37, మొరంగడ్డ 35, కందగడ్డ 55, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



సమావేశంలో పాల్గొన్న గృహ కార్మికులు

బౌద్ధనగర్: గృహకార్మికులకు మొదటి దశలోనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సామాజిక శాస్త్రవేత్త, లీగల్ అడ్వైజర్ పులిగిల్ల వీరమల్ల యాదవ్ అన్నారు. శనివారం వారసీగూడలో గృహకార్మిక యూనియన్ సమావేశం జరిగింది. యూనియన్ హైదరాబాద్ జిల్లా ఫీల్డ్ వర్కర్స్ కోఆర్డినేటర్ మంజుల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గృహ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, గీతాంజలి, స్వాతి, మాధవి, సబిత,శోభా,మాధురి తదితరులున్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లోని నవీన్ యాదవ్ గురుస్వామి, అర్వింద్‌యాదవ్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు అయ్యప్ప నామస్మరణలతో, అయ్యప్ప నినాదాలతో హోరెత్తించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


అదుపుతప్పి.. ఫుట్‌పాత్‌పైకి దూసుకొచ్చి..



ఫుట్‌పాత్‌పైకి ఎక్కిన కారు..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో టాటా నానో కారు అదుపు తప్పి ఫుట్‌పాత్‌ను ఢీకొట్టిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శనివారం ఉదయం రోడ్ నెం.10 కేన్సర్ ఆస్పత్రి వైపు టాటా నానోకారులో సొమాలియా దేశస్తుడు అహ్మద్ వస్తున్నాడు. తెలంగాణ భవన్ రోడ్డులోకి రాగానే కారు ఒక్కసారిగా అదుపు తప్పింది. కారును కంట్రోల్ చేసే క్రమంలో అహ్మద్ డివైడర్‌కు ఢీకొట్టి ఫుట్‌పాత్‌పైకి ఎక్కించాడు. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న అహ్మద్ కాలు విరిగింది. గమనించిన స్థానికులు అహ్మద్‌ను ఆస్పత్రిలో చేర్పించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాత నేరస్తుడి అరెస్టు



నిందితుడు మహ్మద్ ఇష్తేకర్

పంజగుట్ట: నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలో పదుల సంఖ్యలో దొంగతనాలకు పాల్పడ్డ పాత నేరస్తున్ని స్పెషల్ జోనల్ క్రైమ్ టీం శనివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చాంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ ఇష్తేకర్ (30) క్యాబ్ డ్రైవర్ కాగా, జల్సాలకు అలవాటుపడి దొంగతనాలను ప్రవృత్తిగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో రద్దీగా ఉండే ప్రాంతాలు, హాస్టళ్లల్లో సెల్‌ఫోన్లు, పర్సులు కొట్టేస్తున్నాడు. పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌తో పాటు, నగరంలోని పలు పోలీస్‌స్టేషన్‌లల్లో ఇతనిపై ఇప్పటికే పదుల సంఖ్యలో కేసులు నమోదు అయ్యాయి. సదరు నిందితుని టీంలో ప్రధాన నిందితుడు ఇంతియాజ్‌పై నగరంలో 50 కేసులకు పైగా ఉన్నాయి. ఇతని టీంలో మొత్తం 9మంది సభ్యులు ఉండగా ఇంతియాజ్‌తో పాటు, మరో ఐదుగురిని గతంలోనే పంజగుట్ట పోలీసులు అరెస్టు చేయగా, శనివారం సీసీఎస్ పోలీసులు మహమ్మద్ ఇష్తేకర్‌ను అరెస్టు చేసి పంజగుట్ట పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితున్ని రిమాండ్‌కు తరలించారు.

చురుగ్గా 'ఇందిరమ్మ' లబ్ధిదారుల సర్వే

క్షేత్రస్థాయిలో దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు • 20 వేల మంది దరఖాస్తు



క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్న హౌసింగ్, జీహెచ్ఎంసీ అధికారులు

- ప్రజాపాలన కార్యక్రమంలో వేలాది కుటుంబాలు ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నాయి.
- జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ పరిధిలో సుమారు 20 వేల దరఖాస్తులు వచ్చాయి.

ఖైరతాబాద్/బన్సీలాల్‌పేట్: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. జీహెచ్ఎంసీ, హౌసింగ్ విభాగం అధికారులు రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే చేపట్టారు. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం బేగంపేట్ జీహెచ్ఎంసీ పరిధిలోని డివిజన్లలో పెద్ద ఎత్తున సర్వే నిర్వహిస్తున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారి ఇంటింటికీ వెళ్లి వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటున్నారు. ఇప్పటికే హౌసింగ్ విభాగానికి చెందిన సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటదాస్ రెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఏఎంసీ కిరణ్ రెడ్డి తదితరులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్ధిదారులను గుర్తించడానికి అధికారులు పెద్ద కసరత్తు చేస్తున్నారు. ఎంపికలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అధికారులు రంగంలోకి దిగి సర్వే చేస్తున్నారు.

- ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు మాత్రమే క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5లక్షలు మంజూరు చేస్తుంది.

పరిశీలన వేగవంతంగా సాగుతోంది



ఇందిరమ్మ ఇండ్ల కోసం అర్హులైన పేదల ఎంపిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య చెప్పారు. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం సుమారు 20వేల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రజాపాలనలో ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్ర స్థాయిలో పరిశీలన కార్యక్రమం వేగవంతంగా సాగుతుందని పేర్కొన్నారు. నిజమైన లబ్ధిదారులను క్షేత్రస్థాయి సర్వే ద్వారా ఎంపిక చేస్తున్నామన్నారు. సుమారు 30 మంది సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని తెలిపారు.

– డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య

ఉత్సాహంగా ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న అధ్యాపకులు

లాలాపేట: తార్నాకలోని ఐఎస్ఎఓ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ సందడిగా జరిగింది. దాదాపు 25 వరకు స్టాల్స్ ఏర్పాటు చేసిన విద్యార్థులు భారతీయ సంప్రదాయ 85 రకాలైన వంటకాలను స్వయంగా వండి ప్రదర్శించారు. తాము చదువగలము.. గరిటె తిప్పి రుచికరమైన వంటకాలను సైతం సిద్ధం చేయగలమనీ ఐఎస్ఓ కళాశాల విద్యార్థులు నిరూపించుకున్నారు. ఈ ఫుడ్ ఫెస్ట్‌కు హాజరైన అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన వంటకాలను రుచి చూసి సూపర్ అంటూ కితాబిచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఉమా కొంపల్లి మాట్లాడుతూ కళాశాల డైరెక్టర్ టి. వినోదావెంకటస్వామి మార్గదర్శకత్వంలో తమ కళాశాలలో మొట్టమొదటి సారి ఫుడ్ ఫెస్టవల్‌ను నిర్వహించామన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రుచికరమైన వంటలను తయారు చేసి ప్రదర్శించారని కొనియాడారు. విద్యార్థులు భవిష్యత్‌లో చక్కని వంటలు చేసుకునే ప్రావీణ్యాన్ని గడించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ ప్రదీప, వైస్ ప్రిన్సిపాల్ రాజశ్రీ,దివ్య, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సందడి చేసిన చిన్నారులు



సనత్‌నగర్: నెక్ట్స్ డికేడ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో 'ఎడ్యుకేషన్ టాలెంట్ సెర్చ్' పేరిట జెక్‌కాలనీ మహాత్మాగాంధీ పార్కులో వివిధ అంశాల్లో చిన్నారులకు పోటీలు నిర్వహించారు. జెక్‌కాలనీ ఫెడరేషన్ సహకారంతో జరిగిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 100 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చెస్, వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, క్విజ్ తదితర పోటీల్లో ప్రతిభను చాటారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చందు రాజశేఖర్‌లు హాజరై మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో మేధాశక్తిని వెలికి తీస్తాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కమలేష్ మహంతి, జాహ్నవి, సాయిపవన్, రేవంత్, కార్తీక్, ఫెడరేషన్ ప్రతినిధులు రామసుబ్బారెడ్డి, సోమ వెంకట్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచాన్ని ఏకం చేసేదే క్రిస్మస్

సీఎస్ఐ మెదక్ డయాసిస్ బిషప్ రూబెన్ మార్క్



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: ఏసు క్రీస్తు పుట్టిన రోజైన క్రిస్మస్ పర్వదినం ప్రపంచాన్ని ఏకం చేస్తుందని సీఎస్ఐ మెదక్ డయాసిస్ బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జర్నలిస్టు ఫర్ క్రైస్ట్ (జేఎఫ్‌సీ) ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని సీఎస్ఐ మెదక్ డయాసస్ కార్యాయంలో సెమి క్రిస్మస్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కేక్‌ను కట్ చేసి అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మొట్టమొదటి సారి క్రైస్తవ జర్నలిస్టులు ఒక చోట చేరి ఇలా క్రిస్మస్ ఉత్సవాలు జరుపుకోవడం చాలా శుభపరిణామం అని అన్నారు. ఉస్మానియా జర్నలిజం విభాగం మాజీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ స్టీవెన్సన్, సీనియర్ జర్నలిస్టులు స్టెర్లీ రాజన్,రవికుమార్, విజయమేరీ, క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం 9,251 దరఖాస్తులు

బౌద్ధనగర్: రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు శనివారం బౌద్ధనగర్ మున్సిపల్ డివిజన్ పరిధిలో క్షేత్రస్థాయికి వెళ్లిన అధికారులు దరఖాస్తు దారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ అధికారి వెంకటదాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో బౌద్ధనగర్ డివిజన్ న్యూ అశోక్ నగర్, ఎల్ నారాయణ నగర్, బౌద్ధనగర్, వారసిగూడ తదితర ప్రాంతాల నుంచి ఇందిరమ్మ ఇండ్ల కోసం 9,251 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇంటింటికి వెళ్లి దరఖాస్తు దారుల నుంచి వివరాలను సేకరిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఓమర్, నరసరాజు, లలిత తదితరులున్నారు.

సోలార్ ప్యానల్స్ ఇప్పిస్తానంటూ మోసం

నిందితుడి అకౌంట్ ఫ్రీజ్ చేయించిన పోలీసులు

అమీర్‌పేట: ఆన్‌లైన్‌లో పరిచయమైన ఓ అగంతకుడు సోలార్ ప్యానల్స్ ఇపిస్తానంటూ మోసంచేశాడు. దీంతో బాధితులు ఎస్ఆర్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు..ఎస్ఆర్‌నగర్ చౌరస్తా సమీపంలో జి.ప్రసాద్ అనే వ్యక్తి ఇటీవలే సోలార్ ప్యానల్స్ విక్రయించే వ్యాపారాన్ని ప్రారంభించాడు. ప్యానల్స్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తుండగా ఫేస్‌బుక్‌లో ఓ యాడ్ కనిపించింది. దానిని క్లిక్ చేయగా అవతలి నుండి ఓ వ్యక్తి ఫోన్ చేసి మాట్లాడి మీకు కావాల్సిన సోలార్ ప్యానల్స్ తక్కువకే ఇప్పిస్తామని తన మాటలతో పూర్తిగా నమ్మించాడు. దీంతో శుక్రవారం ఉదయం అగంతకుడు చెప్పిన ఖాతాకు రూ.5 లక్షలు పంపించాడు. కొద్ది సేపటి తర్వాత అతనితో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించాడు. వెంటనే స్పందించిన సైబర్ వారియర్, మహిళా హెడ్ కానిస్టేబుల్ దీనా ఎన్‌సీఆర్‌పి బ్యాంకు అధికారులతో మాట్లాడి అకౌంట్లను ఫ్రీజ్ చేయించడంతో రూ.4,65,858 బ్లాక్ చేయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

మహిళల అభివృద్ధితోనే సమాజాభివృద్ధి


కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ గుర్తుచేశారు. ప్రతి మహిళ పొదుపు సంఘంలో చేరి తన కుటుంబానికి బాసటగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బోరబండ సైట్–1 షాహీద్ తుర్రేబాజ్‌ఖాన్ సామాజిక భవనంలో జీహెచ్ఎంసీ యూసీడీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన పొదుపు సంఘాల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మహిళా సాధికరతకు పెద్దపీట వేయడం జరుగుతున్నదన్నారు. ఆరు గ్యారంటీ పథకాల్లో ఎక్కువశాతం మహిళా సంక్షేమానికి సంబంధించినవని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ పొదుపు సంఘంలో సభ్యులుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ దిశగా అన్ని వర్గాల మహిళలకు చైతన్యవంతం చేయాలని కోరారు. పొదుపు సంఘాల నాయకత్వాల్లో మార్పు తీసుకొచ్చి కొత్తవారికి అవకాశం కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ యూసీడీ సీపీఓ వెంకట్ కిషన్, శ్రీనివాస్, ఆర్‌పీలతోపాటు డివిజన్‌లోని వివిధ బస్తీలకు చెందిన పొదుపు సంఘాల సభ్యురాళ్లు పాల్గొన్నారు.

క్రిస్మస్ వెలుగులు



లాలాపేట: క్రిస్మస్ సందర్భంగా చర్చిలను వివిధ రంగులతో, విద్యుత్ దీపాల వెలుగులతో అందంగా అలంకరించారు. శాంతినగర్‌లో ఎస్ఎఫ్ఎస్ చర్చి విద్యుత్ లైట్ల వెలుగుల్లో అత్యంత ఆకర్షణగా కనిపిస్తుంది. తార్నాక డివిజన్ లాలాపేట లక్ష్మీనగర్‌లో ఓ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ సెట్టింగ్స్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.





సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

సనత్‌నగర్: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో మోండా డివిజన్‌కు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా మెరుగైన వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, ప్రమోద్, నందు తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న సెంటర్ ఇంచార్జి శోభారాణి

లాలాపేట: తార్నాకలోని అబాకస్(యూసి మాస్) సెంటర్ విద్యార్థులు అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటారు. ఈ మేరకు ఇటీవల దేశ రాజధాని డిల్లీలో నిర్వహించిన అబాకస్, మెంటల్ ఆర్థమెటిక్ పోటీల్లో దేశ విదేశాల నుంచి దాదాపు 6 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో తార్నాకకు చెందిన అస్లేషా, లేఖ్య శ్రీ, కృష్ణసాత్విక్ అనే ఈ ముగ్గురు విద్యార్థులు పాల్గొని అవార్డులు,విన్నర్‌గా నిలిచి అవార్డులను గెలుచుకున్నారు. శనివారం తార్నాక అబాకస్ సెంటర్ ఇంచార్జి శోభారాణి విద్యార్థులను అభినందించారు.

మా భూములను ఇప్పించండి

పంజగుట్ట: గిరిజన అసైన్డ్ భూములు తన భూములుగా చూపుకొని పెద్దపెద్ద సంస్థలకు అమ్ముకుంటున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పలు గిరిజన సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీరాంనాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్.రాంబాల్ నాయక్, బాధిత గిరిజన కుటుంబాలతో కలిసి మాట్లాడుతూ రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని రెండు తండాల్లో సుమారు 2వేల ఎకరాల భూమిని విక్రమ్ రెడ్డి పటేల్ పూర్వీకులు ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ప్రకారం అప్పట్లో ప్రభుత్వానికి స్వాధీనం చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం సదరు భూమిని గిరిజనులకు అసైన్డ్ కింద ఇవ్వడంతో కొన్ని దశాబ్దాలుగా గిరిజనులు ఆ భూముల్లో సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. కాగా 1985 తరువాత సదరు భూమిని తాము ల్యాండ్ సీలింగ్‌కి ఇవ్వలేదని ఈ భూములు తమవే అని రెవెన్యూ, ఎమ్ఆర్‌వో, ఇతర సిబ్బంది సాయంతో ధరణిలో పేర్లు కూడా మార్పించుకొని అపర్ణ కన్‌స్ట్రక్షన్స్, గ్రీన్ మార్క్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థలకు స్థలం విక్రయించి నిర్మాణాలు చేపట్టారని తండాల్లోకి వెళ్లేందుకు మార్గాలు మూసేసి తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో ధరణి బదులుగా ప్రస్తుతం తీసుకువచ్చిన భూ భారతితో అయినా తమకు న్యాయం చేయాలని ఎన్నో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న గిరిజనులకే సదరు భూమి దక్కేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో లగచర్ల బాధితుల మాదిరి తాము కూడా రాష్ట్ర వ్యాప్తంగా మరో ఉద్యమాన్ని తీసుకువస్తామని, త్వరలోనే ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రజక ఆత్మగౌరవ భవన నిర్మాణం చేపట్టాలి



సీఎంకు వినతి పత్రం సమర్పిస్తున్న రజక సంఘం నేతలు

లాలాపేట: తెలంగాణ రజక సంఘం నాయకులు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ భగాయత్‌లో 3 ఎకరాల స్థలంలో రజకుల ఆత్మగౌరవ భవనం నిర్మాణం చేయాలని కోరుతూ సీఎంకు వినతి పత్రాన్ని సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం వెంటనే సిఎస్‌కు ఆదేశాలు ఇచ్చారని రజక సంఘం నాయకులు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ స్టేట్ కన్వీనర్ కొన్నె సంపత్‌రజక, దుబ్బాక రమేష్ తదితరులున్నారు.

పికిల్ బాల్‌కోర్టు ప్రారంభం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో పికిల్ బాల్ కోర్టును జేఐసీ అధ్యక్షుడు కె. సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కిలారు రాజేశ్వరరావులు ప్రారంభించారు. అమెరికాలో పాపులర్ గేమ్‌గా ఉన్న ఈ ఆటను మొదటిసారిగా హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ క్లబ్ ఆవరణలో పరిచయం చేశారు. టేబుల్ టెన్నిస్, టెన్నిస్‌కు క్రాస్ బ్రీడ్ గేమ్‌గా పికిల్ బాల్ గేమ్ ప్రాచుర్యం పొందింది. టేబుల్ టెన్నిస్ లాగానే ఈ ఆటలో కూడా చిన్న బ్యాట్ చిన్న బాల్ ఉంటుందని, అయితే కోర్టు మాత్రం టెన్నిస్ కోర్టు లాగా నెట్‌తో పాటు కొద్దిగా చిన్నగా ఉంటుందని కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు తెలిపారు. ఇది అన్ని వయస్సుల వారు ఆడుకునే ఆట అని వెల్లడించారు. ఈ గేమ్‌ను తమ క్లబ్‌లో ప్రవేశపెట్టడం తమకెంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కన్వీనర్ ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆలోచింపజేస్తున్న పెయింటింగ్స్..

గ్లోబల్ వార్మింగ్‌తో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఏర్పడుతుందని, దీనిపై ప్రతిఒక్కరూ మేల్కొనవలసిన అవసరం ఉందంటూ జీహెచ్ఎంసీ వాల్ పెయింటింగ్స్ చైతన్యాన్ని రగిలిస్తున్నాయి. మరోవైపు సోషల్ మీడియా ప్రభావంతో సమాజంలో ఎదురవుతున్న పరిణామాలను కళ్లకు కట్టినట్లుగా చూపించారు. నగర సుందరీకరణలో భాగంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నగర వ్యాప్తంగా ఫ్లైఓవర్లు, వంతెనలు, గోడలు..ఇలా అవకాశం ఉన్న ప్రతిచోటా సందేశాత్మక చిత్రాలను వేసి పౌరుల్లో సామాజిక స్పృహను కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా అమీర్‌పేట ధరంకరంరోడ్డులో గ్లోబల్ వార్మింగ్, సోషల్ మీడియా ద్వారా ఉత్పన్నమవుతున్న అనర్థాలను బొమ్మల రూపంలో ఇలా సందేశమిస్తున్నారు. – సనత్‌నగర్







